క్లుప్తంగా

సర్మాస్ హుసేనీస్ స్వామి దర్గాలో ఫాతెహాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీస్ స్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుతీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామివారి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు.

ఘనంగా జేసీఎం చర్చి వార్షికోత్సవం



పాస్టర్ హంపన్న ఆధ్వర్యంలో ప్రార్థనల్లో క్రైస్తవులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలోని జీసస్ కాలింగ్ మినిస్ట్రీస్ (జేసీఎం) చర్చి లో గురువారం పదో వార్షికోత్సవం ఘనంగా జరుపుకున్నారు. వార్షికోత్సవంతో పాటు క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని చర్చిని సుందరంగా తీర్చిదిద్దారు. జేసీఎం చర్చి ఫౌండర్, పాస్టర్ హంపన్న ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పాస్టర్ మాట్లాడుతూ 25న జరిగే క్రిస్మస్ వేడుకలకు ముఖ్య వక్తలుగా సాముయేల్ రవి (బళ్లారి), పాస్టర్ బాబు(తిరుపతి), పాస్టర్ డేవిడ్ (అనంతపురం) హాజరవుతున్నట్లు తెలిపారు.

ఇద్దరు కర్ణాటక మద్యం విక్రేతల అరెస్ట్



కర్ణాటక మద్యం ప్యాకెట్లు పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

కంబదూరు: కంబదూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పరిధిలోని రెండు ప్రాంతాల్లో ఎక్సైజ్ సీఐ సునీల్, ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇద్దరు మద్యం విక్రేతలను గురువారం అరెస్టు చేశారు. శెట్టూరు మండలం ఐదు కల్లులో మంగలి గోపి అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతని నుంచి నుంచి 96 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కుందుర్పిలో బోయ అనసూయమ్మ నుంచి 120 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై ఎక్సైజ్ సీఐ సునీల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెనూ పక్కాగా అమలు చేయాలి



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ తిమ్మప్ప తదితరులు

వజ్రకరూరు: మధ్యాహ్న భోజన పథకం మెనూ పక్కాగా అమలు చేయాలని ఎంఈఓ తిమ్మప్ప ఆదేశించారు. గురువారం స్థానిక ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ తిమ్మప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులు,ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాలను రుచిచూశారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం కౌసల్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా ఊట ధ్వంసం



నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కణేకల్లు: మండలంలోని హనకనహాళ్ గ్రామ శివారులో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్, కణేకల్లు ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు చేసి నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. హనకనహాళ్ శివారులో ఎన్‌ఫోర్స్‌మెంటు ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ, ఎస్ఐ హరికృష్ణ, కణేకల్లు ఎక్సైజ్ సీఐ ఉమాబాయి, హెడ్‌కానిస్టేబుల్ ఫణీంద్ర దాడి చేశారు. అక్కడ 700 లీటర్ల నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న ఊట ధ్వంసం చేశారు.

వామ్మో.. చలిపులి



మంచుదుప్పట్లో రాయదుర్గం

- వణుకుతున్న పల్లె, పట్టణాలు
- పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- చలిమంటలతో సేద తీరుతున్న ప్రజలు

రాయదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలపై చలి పంజా విసిరింది. వారం రోజుల కిందట 15-20 డిగ్రీలున్న ఉష్ణోగ్రతలు బుధవారం 10 నుంచి 12 మధ్య డిగ్రీలకు పడిపోయింది. రాయదుర్గంలో కేవలం 10 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా.. కళ్యాణదుర్గంలో 12, ఉరవకొండలో 14 డిగ్రీలుగా నమోదైనట్టు తెలిసింది. మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఈ మూడు చోట్ల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు కలవరపడుతున్నారు. ఉదయం ఏడు గంటలు దాటుతున్నా సూర్యుడు కనిపించని పరిస్థితి నెలకొంది. వేకువజామున పొగ మంచుకురుస్తుండడంతో పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

కర్ణాటక సరిహద్దుకు ఆనుకొని ఉన్న రాయదుర్గం.. బీటీపీతో పాటు హెచ్ఎల్‌సీ పరిసరాల్లో నీటి ప్రవాహం కనిపిస్తుండడం, చుట్టూ దట్టమైన కొండలు ఉండటం లాంటి కారణాలు వెరసి



రోగులతో కిటకిట లాడుతున్న రాయదుర్గం ఏరియా ఆస్పత్రి

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉవరకొండ నియోజకవర్గాల్లో భిన్నమైన వాతారణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. వేసవిలో అనంతపురం తర్వాత రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలుంటే ..చలికాలంలో ఉమ్మడి జిల్లాల్లోనే అత్యల్పంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం విశేషం. గాలిలో తేమ శాతం పెరిగిపోవడం , ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పులతో చలి తీవ్రత పెరిగిందని వైద్యులు అంటున్నారు. సాధారణంగా జనవరి నెలలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అలాంటిది ఈ ఏడాది డిసెంబర్ లోనే ఉష్ణోగ్రతలు అత్యల్పంగా పడిపోయవడం ఆందోళన కలిగిస్తోంది. సాయంత్రం ఆరు దాటితే చాలు భయట కురాని పరిస్థితి కనిపిస్తోంది. చలిపులికి తట్టుకోలేక వృద్ధులు, పిల్లలు గజగజ వణికిపోతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులపై చలి ప్రభావం ఎక్కువగా ఉంటోందని వైద్యులు చెపుతున్నారు. వైరల్ వ్యాధులతో పాటు జలుబు, దగ్గు, జ్వరం, ముక్కుకారడం లాంటివి వస్తుంటాయి. ఈ కాలంలో వైరస్, బ్యాక్టీరియా సులభంగా వ్యాప్తి చెందుతాయి. ఈ క్రమంలో పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా చలి మంటలతో సేదా తీరే పరిస్థితి కనిపిస్తోంది. వేకువజామున పాలు, పూలు, కూరగయాలు, పారిశుధ్య కార్మికులు చలిని తట్టుకునేందుకు నానా తంటాలు పడాల్సిన వస్తోంది.

ఎండలోనే నడవాలి..

పొగమంచు ప్రభావంతో గాలిలోని కాలుష్యం పైకి వెళ్లదు. ఉదయం కాలినడకన వెళ్లేవారు దీని భారిన పడి శ్వాసకోశ వ్యాధులకు గురవుతారు. ఏడు గంటల తర్వాత ఎండవచ్చాకే వాకింగ్‌కు వెళ్లడం .. లేదంటే సాయంత్రం సమయాల్లో వ్యాయమం చేయడం అలవాటు చేసుకోవాలి. ఉదయం నడకకు వెళ్లాలనుకుంటే ఉన్ని దుస్తులు, చేతి గ్లౌజులు, ముక్కు, చెవులు మూసే విధంగా మంకీ క్యాపులు ధరించడం వల్ల చల్లదనం నుంచి కాపాడుకోవచ్చు.



బొమ్మనహాళ్‌లో పొగమంచు



కూడేరు వద్ద ఉదయం చలికి తాళలేక చలిమంట కాచుకుంటున్న దృశ్యం

జాగ్రత్తలు తీసుకోవాలి



వాతావరణంలో మార్పుల వల్ల రాత్రి ఉష్ణోగ్రతలతో పాటు పగటి ఉష్ణోగ్రతలు కూడా పడిపోతున్నాయి. చాలా మందిలో జ్వరం, జలుబు, న్యూమోనియా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడం లాంటి సమస్యలతో ఆస్పత్రులకు వస్తున్నారు. కొందరు చర్మ సంబంధిత వ్యాధుల భారిన పడుతున్నారు. రానున్న రోజుల్లో చలితీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుత సమయంలో పిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వీలైనంత వరకు ఉదయం 8 గంటలకు రాత్రి 8 తర్వాత బయటకు వెళ్లకపోవడం మంచిది. ఉన్ని దుస్తులు ధరించడం, వేడి నీళ్లతో స్నానం చేయడం, మంకీ క్యాప్ ధరించడంలాంటివి విధిగా పాటించాలి. ఈ సీజన్ ముగిసే వరకూ గోరువెచ్చని నీరు తాగడం మంచిది. ఏ చిన్నపాటి జ్వరమొచ్చినా సమీప ఆస్పత్రుల్లో చేరి వైద్యసేవలు పొందాలి.

– మెర్సి జ్ఞానసుధ, మెడికల్ సూపరింటెండెంట్, రాయదుర్గం ఏరియా ఆస్పత్రి

కనుల పండువగా పల్లకీ ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయి

వజ్రకరూరు:స్థానిక షిర్డీసాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనులపండువగా జరిగింది. ఆల యంలో స్వామికి పూజలతోపాటు అభిషే కాలు, తీర్థ ప్రసాద వినియోగం,అ ర్చనలు, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం, హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది.

వాల్మీకులు అన్నిరంగాల్లోనూ రాణించాలి

బొమ్మనహాళ్: అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చకూడదని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బి. మోహన్‌కుమార్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణలో గిరిజన విద్యార్థులతో కలిసి ఆయన మాట్లాడారు. ఆర్థికంగా సామాజికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చకూడదన్నారు. గిరిజనులు ఇప్పటికీ చాలాచోట్ల అడవుల్లో నివశిస్తున్నారని, వారికి విద్య, ఉద్యోగాలు, ఉపాధి లేక దారిద్ర్యం అనుభవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు రాజు, రమేష్, భాస్కర్, గోపాల్ బాబు, అశోక్, రామంజి, మణికంఠ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫసల్ బీమా ప్రీమియం చెల్లింపు గడువు పొడిగింపు

వజ్రకరూరు: ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన (2024-25)పథకం ప్రీ మియం చెల్లింపు గడువును ఈనెల 31 వరకు పొడిగించినట్లు ఏఓ మధుకర్ తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓ మాట్లాడారు. రబీ సీజన్‌కు సంబంధించి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీ మా యోజన (20 24-25)పథకాన్ని అమలు చేసినట్లు వెల్లడించారు. ప్రీమియం చెల్లించడానికి డిసెంబర్ 15 ఆఖరు తేదీగా ఉండేదని, ఈనెల 31 వరకు పొడిగించినట్లు ఏఓ తెలిపారు.

వేంకటరమణుడికి ధనుర్మాస పూజలు



ధనుర్మాసపూజలందుకున్న సతీసమేత వేంకటరమణస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రముఖ ఆలయాల్లో ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. గురువారం స్థానిక కోటలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో తెల్లవారు జామున 5 గంటల నుంచి ధనుర్మాస పూజలు జరిగాయి. అర్చకులు బాల మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, అభిషేకాలు, కుంకుమార్చన, నైవేద్యం, తిరుప్పవై సేవ, పుష్పార్చన, ప్రసాద వినియోగ కార్యక్రమాలు జరిగాయి. జనవరి 10న వైకుంఠ ఏకాదశి, 13న గోదాదేవి కల్యాణోత్సవం జరుగుతుందని దేవదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదు చేపట్టిన ఏపీ వైఎస్సార్ టీఏ ప్రెసిడెంట్ పి.అశోక్‌కుమార్ రెడ్డి

బెళుగుప్ప: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఏపీ వైఎస్సార్‌టీఏ ప్రెసిడెంట్ పి.అశోక్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని బెళుగుప్ప తదితర గ్రామాల్లో రాష్ట్ర కమిటీ సభ్యులు ఏపీ వైఎస్సార్‌టీఏ సభ్యత్వ నమోదు చేపట్టారు. స్టేట్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా ఉపాధ్యాయ సమస్యలైన ఐఆర్ ఊసేలేదని, పెండింగ్ డీఏ చెల్లించలేదన్నారు. ప్లస్‌టు పాఠశాలలను కొనసాగించాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. యాప్‌ల భారం తగ్గించాలని పీఎఫ్ లోన్లు చెల్లించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో ఏపీవైఎస్సార్ టీఏ రాష్ట్ర, జిల్లా కమిటీ నాగిరెడ్డి, శ్రీధర్‌గౌడ్, గోవిందరెడ్డి, గంగాదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం



ఎర్రగుడి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్

బ్రహ్మసముద్రం : భూసమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు తెలిపారు. గురువారం బ్రహ్మసముద్రం మండలంలోని వేపులపర్తి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు, ప్రజలు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను త్వరితగిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ నందకిశోర్, ఆర్ఐ నాగిరెడ్డి, మండల సర్వేయర్ సుకర్ణ, గ్రామ సర్పంచ్ రంగప్ప, వీఆర్వోలు మల్లికార్జున , మర్రిస్వామి, దేవదాయ శాఖ అధికారులు గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

బెళుగుప్ప:గ్రామాల్లో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సక్రమంగా సద్వినియోగం చేసుకోండని డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఆవులెన్న, ఎర్రగుడి గ్రామాల్లో తహసీల్దార్ షర్మిళ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. డిప్యూటీ తిప్పేనాయక్ హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి భూసమస్యలు ఇతర సమస్యలపై వినతులను డిప్యూటీ కలెక్టర్ స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని మండల అధికారులకు డిప్యూటీ కలెక్టర్ సూచించారు. ఆయా గ్రామాల నుంచి మొత్తం 12 వినతులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రమాదేవి, అవులెన్న సర్పంచ్ రాము, వీఆర్ఓ వెన్నెల, వివిధ గ్రామాల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల వినతులన్నీ పరిష్కరిస్తాం

రాయదుర్గంటౌన్: రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో రైతులకు పరిష్కారం చూపుతామని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఇప్పటి దాకా జరుగుతున్న సదస్సుల్లో రైతుల నుంచి అధిక శాతం పట్టాదారు పాసుపుస్తకాలు, సర్వే హద్దు, సబ్‌డివిజన్ కోసం వినతులు వస్తున్నట్లు తెలిపారు. గురువారం బాగినాయకనపల్లిలో రెవెన్యూ సదస్సు జరిగింది. జాయింట్ పట్టదారుల సబ్ డివిజన్ కోసం 9 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. శుక్రవారం 74 ఉడేగోళం గ్రామంలో రెవెన్యూ సదస్సు జరుగుతుందన్నారు.

గుమ్మఘట్ట: గ్రామాల్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని పూలకుంటలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్వే కోసం 4,పాసుపుస్తకాల కోసం 3 వినతులు అందాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, డీటీ రఘు, ఆర్ఐ రామాంజనేయులు, వీఆర్వోలు, అటవీ, దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

బొమ్మనహాళ్: రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మునివేలు తెలిపారు. గురువారం మండలంలోని బండూరు లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న వివిధ రకాల భూ సమస్యలను తమ దృష్టికి తెస్తే, వాటిని రీసర్వే చేసి పరిష్కరిస్తామన్నారు. 9 వినతులు స్వీకరించినట్లు ఆయన వెల్లడించారు. మండల స్పెషలాఫీసర్ తిప్పేస్వామి, సర్వేయర్ రవితేజ, ఆర్ఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని మరుట్లలో గురువారం అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలుమార్లు అర్జీలు ఇచ్చుకున్నా భూసమస్యలు పరిష్కారం కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూ, ఇతర సమస్యల పరిష్కారానికి సంబంధించి 20 అర్జీలు వచ్చాయి. వాటిని డీటీ సూర్య ప్రతాప్ స్వీకరించారు. మండల సర్వేయర్ ఆయేషా సిద్దిక్, వీఆర్వోలు శంకరనారాయణ పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

వజ్రకరూరు: మండల పరిధిలోని జరుట్లరాంపురంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ నయాజ్‌అహమ్మద్ గురువారం తెలిపారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు

ఉరవకొండ: పరిమితికి మించి ఆటో డ్రైవర్లు ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ జనార్దన్‌నాయుడు హెచ్చరించారు. గురువారం 42వ అనంతపురం – బళ్లారి జాతీయ రహదారిపై ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులు వెళ్తుండగా, ఎస్ఐ వారికి అవగాహన కల్పించారు. అధిక లోడులతో ఆటోలతో అనేక ప్రమాదాలు జరిగాయని, ఇందులో పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారన్నారు.

రేపు పూలచెర్లలో ఉచిత కంటి వైద్య శిబిరం

కణేకల్లు: పూలచెర్ల గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. బళ్లారి ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు కంటి వైద్య నిపుణులు ఈ క్యాంపునకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఐ క్యాంపు కొనసాగనుందన్నారు. మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

కళ్యాణదుర్గం రూరల్: అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి చేసిన వ్యాఖ్యలు సరికాదని జేపీసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర మంత్రి అమిత్‌షా చిత్రపటాన్ని దహనం చేశారు. ఎస్సీ, ఎస్టీ జేపీసీ నాయకుడు చెలిమప్ప మాట్లాడారు.

జాతీయ స్థాయిలో రాణించాలి



జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు వెళ్తున్న క్రీడాకారులకు దుస్తులు అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ:సెపక్‌తక్రా జాతీయ స్థాయిలో క్రీడా పోటీల్లో మరింత ప్రతిభ చూపి విజేతలుగా నిలవాలని ఉరవకొండ రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్, ఎస్ఐ జనార్దన్‌నాయుడు ఆకాంక్షించారు. గురువారం స్థానిక ఆర్‌డీటీ ఫీల్డ్ కార్యాలయంలో ఆర్‌డీటీతో పాటు ఉరవకొండలోని మహేశ్వరి ఇంగ్లిషు మీడియం హైస్కూల్ సహకారాలతో ఉచిత శిక్షణ క్యాంపులతో పాటు క్రీడాకారులకు క్రీడాదుస్తులు, ఇతర క్రీడా సామగ్రిను అందించారు. ఆర్‌డీటీ ఎంఅండ్‌డీ ఆఫీసర్ కిష్టప్ప, సెపక్‌తక్రా క్రీడా సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 27 వరకు కేరళ రాష్ట్రంలోని పయనీర్లు జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయన్నారు. కార్యక్రమంలో సెపతక్‌తక్రా జిల్లా కార్యదర్శి షాహీన్, సెంట్రల్ స్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎం దావూద్, లయన్స్ సభ్యులు గణేష్‌బాబు, సీనియర్ పీడీ మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

బొమ్మనహాళ్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఎంపీడీఓ దాస్ నాయక్ అధ్యక్షతన శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఈఓపీఆర్‌డీ దాస్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల క్షేత్రస్థాయిలో అధికారులు ప్రజలతో సమన్వయమై పల్లెల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు.

ఆర్టీసీ డోర్ డెలివరీపై అవగాహన కల్పించాలి



గేట్ మీటింగ్‌లో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు

రాయదుర్గంటౌన్: ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలపై ప్రతి ఉద్యోగి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఉద్యోగులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ నెల 20 నుంచి జనవరి 19 వరకు కార్గో పార్శిల్, కొరియర్ రవాణా విభాగం ఆధ్వర్యంలో డోర్ డెలవరీ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలతోపాటు పట్టణాల్లో 50 కేజీల బరువు వరకు 10 కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలవరీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. మాసోత్సవాల్లో భాగంగా ప్రతి ఆర్టీసీ ఉద్యోగి నెల రోజుల పాటు రోజూ కనీసం మూడు పార్శిళ్లు బుక్ చేయడంతోపాటు సంస్థ డోర్ డెలవరీ సౌకర్యాన్ని వర్తకులు, వినియోగదారులకు ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఎఫ్ శిరీష, ఎంసీ కృష్ణయ్య, ఏడీసీలు, కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నాగరాజు పాల్గొన్నారు.

హమాలీ చార్జీలు చెల్లించరా?



రైతుల నుంచి వరిధాన్యం కొంటున్న దృశ్యం

కణేకల్లు: వరిధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం సొమ్ము చెల్లిస్తున్నా.. హమాలీ చార్జీలు మాత్రం చెల్లించకపోవడంపై రైతుల్లో సర్వత్రా ఆందోళన నెలకొంది. కణేకల్లులో అధికారులు వరికొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నారు. ఆదర్శభారతి రైతుసేవా సహకార సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు అధికారులు 84 మంది రైతుల నుంచి 10,305 క్వింటాళ్ల వరిధాన్యాన్ని కొనుగోలు చేశారు. క్వింటాళు వరిధాన్యానికి కనీస మద్దతు ధర రూ.2,320గా నిర్ణయించారు. రాసుల వద్ద బస్తాలో వరిధాన్యం నింపడం, తుకం వేసి లారీల్లో లోడింగ్ చేయడం వంటి హమాలీ చార్జీలను కూడా ప్రభుత్వమే చెల్లించాలి. హమాలీ చార్జీలు క్వింటాల్‌కు రూ.17.17 పైసలు చెల్లించాల్సి ఉండగా, ఆ మొత్తం రైతుల ఖాతాలకు జమా కావడం లేదు. కేవలం ధాన్యం సొమ్ము మాత్రమే రైతుల ఖాతాల్లో జమావుతున్నాయి. ఒక్కో రైతుకు హమాలీ చార్జీలు రూ.5వేల నుంచి రూ. 6 వేల వరకు హమాలీ చార్జీలు రావాల్సి ఉంది. తమ ఖాతాల్లో వరిధాన్యం డబ్బులొక్కటే జమ కావడంతో రైతులు రైతు సేవా సహకార సంఘానికి వచ్చి ఆరా తీస్తున్నారు. మీకు రావాల్సిన వరిధాన్యం, హమాలీ చార్జీల పేమెంట్ వివరాలు ఏపీ పాడి ప్రొక్యూర్మెంట్ పోర్టల్‌లో పక్కాగా అప్‌లోడ్ చేస్తున్నామని, టెక్నికల్‌గా తమ వద్ద ఎలాంటి పొరబాటు జరగలేదని, త్వరలో మీ సొమ్ము వస్తుందని సిబ్బంది సర్దిచెబుతున్నా రైతులు మాత్రం అసంతృప్తిలో ఉన్నారు.

తూకాల్లో మోసంపై పోలీసులకు ఫిర్యాదు

వజ్రకరూరు: మండలంలోని చాబాలలో కందుల తూకాల్లో జరుగుతున్న మోసాన్ని కొందరు రైతులు గుర్తించి, వ్యాపారిపై పోలీసులకు గురువారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. కూడేరుకు చెందిన వ్యాపారి, మరో ఇద్దరు దళారులు చాబాలలో కందులు కొనుగోలు చేసేందుకు వచ్చారు. కందులు తూకాల్లో 50 కిలోలకు అదనంగా 10 కిలోలు సేకరించారు. దీంతో రైతులకు అనుమానం రావడంతో తూకం వేసిన బస్తాను మరోచోటకు తీసుకెళ్లి తూకం వేశారు. 50 కిలోల బస్తాపై అదనంగా 10 కిలోలు సేకరించినట్లు గుర్తించారని రైతులు గుర్తించగా, అక్కడి నుంచి సదరు వ్యాపారి ఉడాయించాడు. రైతులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని వేయింగ్ మిషన్‌తోపాటు సేకరించిన కందులు, వాహనాన్ని వజ్రకరూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చాబాలకు చెందిన రైతు రుద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూడేరు వ్యాపారి కండ్లపల్లి రాము అలియాస్ రామాంజినే యులు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలు

కూడేరు: మండలంలోని శివరాం పేట సమీపంలో గురువారం అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై వెళ్తున్న ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలోకి వెళ్లడంతో బోల్తా పడింది. అందులో ఉన్న బళ్లారికి చెందిన ఉమేష్ గౌడ్, భీమలింగన్నలు స్వల్పంగా గాయపడ్డారు.